కార్లో ఇద్దరూ మాట్లాడుకోలేదు.

వాళ్ళు వెళ్ళేసరికి ఎడిటర్ శాస్త్రి ఖాళీగానే వున్నాడు "ఏమ్మా, చాలా రోజులైంది కనపడి" అన్నాడు.

" కాస్త బిజీగా వున్నానండీ. బైదిబై, ఈయన ప్రహసిత్"

శాస్త్రి ఒక్క క్షణం తబ్బిబ్బయ్యాడు.

అంత ఆకస్మాత్తుగా ఇంటర్నేషనల్ స్థాయి ఆటగాడిని అక్కడ చూడటం.

ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు.

" నాకు ఒకసారి 13 14 15 స్క్రిప్టు కావాలి సర్"

శాస్త్రి ఆశ్చర్యంగా " ఎందుకమ్మా" అని అడిగాడు.

" నా స్నేహితురాలు లక్ష్మి వ్రాస్తోందది. చాలా కాలంవరకూ నాకూ ఆ విషయం తెలీదు. ఆ స్క్రిప్టు చదివింది నేనేకదా. లక్ష్మి చేతివ్రాత నాకు బాగా తెలుసు. మరి ఆ విషయం ఇంతకాలం ఎందుకు గుర్తించలేకపోయానా అని అనుమానం వచ్చింది. అది మరొకసారి చూద్దామని".

శాస్త్రి బెల్ కొట్టి ఆ మాన్యుస్క్రిప్ట్ తెమ్మని పంపించాడు. అది వచ్చేలోపులో అన్నాడు "ఆ నవల బాగా క్లిక్ అయిందమ్మాయి. నీ స్నేహితురాలే అంటున్నావు కాబట్టి మరొకటి వ్రాయించు".

"వ్రాస్తుందో లేదో తెలీదండీ. మరో నవల వ్రాసేటంత డెప్త్ వుందని నేననుకోను, ప్రయత్నిస్తాను".

" కష్టపడమను అమ్మాయ్. బాగా చదవమను"

మధూహ నవ్వి వూరుకుంది. ప్రహసిత్ ఈ సంభాషణంతా ప్రేక్షకుడిలా వింటున్నాడే గానీ అతని మనసంతా ఉద్వేగంగా వుంది. మధూహ అక్కడికి ఎందుకొచ్చిందో లీలగా అర్థమైంది.

కానీ... కానీ...

ఆలోచనలని భంగం చేస్తూ శాస్త్రి అన్నాడు "అభినందన సాంస్కృతిక సంస్థ వారు ప్రతిఏడూ ఒక ఉత్తమ రచయిత్రికి బహుమతి ఇస్తారు. ఈ సంవత్సరం ఈ నవలకి ఇద్దామనుకుంటున్నారట. వాళ్ళు గానీ కలిస్తే అంగీకరించమని చెప్పు. చాలా మంచి సంస్థ అది. అలాంటి సన్మానాలు మంచి ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని ఇస్తాయి".

బోయ్ ఈ లోపులో స్క్రిప్టు తీసుకొచ్చి బల్లమీద పెట్టాడు. మధూహ ఆత్రంగా దాన్ని చేతుల్లోకి తీసుకుంది.

ప్రహసిత్ ఊపిరి బిగపట్టాడు.
క్షణం కూడా పట్టలేదు.
రెండు చేతివ్రాతలూ ఒక్కటే.
ప్రహసిత్‌క్కూడా నిస్సందేహంగా నిర్ధారణ అయిపోయింది.
ఆ ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాసింది లక్ష్మి.

## 4

కారు నెమ్మదిగా సాగిపోతోంది.

ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

" ఇదంతా నేను నమ్మలేకపోతున్నాను" అంది మధూహ స్వగతంగా. "లక్ష్మి ఎందుకు చేసిందిలా?".

ప్రహసిత్ మాట్లాడలేదు.

“లక్ష్మి స్వభావసిద్ధమైన చేతివ్రాతకీ దీనికీ బాగా తేడా వుంది. అందుకే దీన్ని గుర్తు పట్టటానికి నాకు కష్టమైంది. అంత తేడా ఎలా వచ్చిందో నాకు అర్థం కావడం లేదు. అసలు ఏమి ఆశించి ఈ ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాసి మిమ్మల్ని బెదిరించింది? దానికన్నా ముఖ్యంగా తనకి తానే ఆ బెదిరింపు లేఖలు ఎందుకు వ్రాసుకుంది? అంతగా భయపడినట్టు ఎందుకు నటించింది? నిజంగా అది నటనేనా? నాకు నమ్మశక్యం కావటం లేదు. ఆ ఉత్తరం వచ్చిన రోజు ఆమె మొహంలో భయం నాకింకా గుర్తుంది. చాలా భయపడింది!!! అయినా ఇదంతా ఎవర్ని భయపెట్టటానికి వ్రాసినట్టు?ఎవర్ని మోసం చేయటానికి ?”

“తనని”

మధూహ నిశ్చేష్ఠురాలైనట్టు చూసింది.

ప్రహసిత్ గంభీరంగా అన్నాడు “ఆ ఉత్తరాలు వ్రాసింది లక్ష్మే. అందులో సందేహం లేదు, పారనాయిడ్ సైకాలజీకి పరాకాష్ఠ అది”.

మధూహ అదే నిశ్చేష్టతతో అతనివైపు చూసింది. ప్రహసిత్ తనలో తాను మాట్లాడుకుంటున్నట్టు కొనసాగించాడు.

“ యుగయుగాల తరతరాల స్త్రీ ఉదాసీనతకీ అసంతృప్తికీ ఉదాహరణ లక్ష్మి. మరుసటిరోజు సూర్యోదయం పట్ల ఆసక్తి లేకపోవటం కన్నా దురదృష్టం మరొకటి వుంటుందా? అటువంటి వైవాహిక జీవితంలో ఎన్నో ఏళ్ళు బ్రతికి బ్రతికి శూన్య మైన మనసు చుట్టూ నిరాసక్తతని గోడగా కట్టుకుంది. ఆ పరిస్థితి లోంచి బయట పడాలంటే మనిషి తనను తను ప్రేమించుకోవాలి. ఏదో ఒక ఆనందప్రదమైన దినచర్య. సంతృప్తి నిచ్చే అభిరుచి, నిరంతర మనో శారీరక సంతృప్తి ఏర్పరుచుకోవాలి. ఇవన్నీ కావాలంటే కష్టపడాలి. లేదంటే కర్మ సిద్ధాంతాన్ని ఆశ్రయించాలి. చాలా మందిలాగే లక్ష్మి కూడా సిద్ధాంతాన్నే ఆశ్రయించి పైకి నవ్వుతూ బ్రతుకుతోంది. కానీ మనసులో మాత్రం తనెలావుంటే బావుంటుందో నిరంతరం ఆలోచిస్తూనే వుంది. ఆ ఆలోచనల పర్యవసానమే ఆమె వ్రాసిన 13 14 15 నవల. ఆమె ఊహలకి అవుట్‌లెట్ మనసు. మురళీ రవం ప్రతి గదిలోనూ పల్లవించవలసిన సంసారంలో శరీర మృదంగనాదం పడగ్గదికి పరిమితమవ్వలసి రావటం పట్ల ఆమె ఆవేదన అక్షరంగా రూపుదిద్దుకుంది. ఈ పరిణామక్రమంలో ఆమె రెండుగా విడిపోయింది. ఒకటి వాస్తవ జీవితం మరొకటి

ఊహ. పెళ్ళికాక ముందు ప్రతి ఆడపిల్ల ఎన్నో కలలు కంటుంది. అది నిజమయ్యే అదృష్టవంతులు చాలా కొద్దిమందే వుంటారు. మిగతావారు వాస్తవంతో సర్దుకు పోతారు. ఆమె ఆ విధంగా అడ్జెస్టు కాలేకపోయింది. ఊహల్ని అమితంగా ప్రేమించటం మొదలు పెట్టింది. ఎన్నాళ్ళనుంచో తనలో పేరుకుపోయిన ఊహల్ని నవలలో తనుగా చిత్రీకరించుకుంది. అందుకే ఆమె మామూలు చేతివ్రాతకీ అసలు పొంతన లేదు".

మధూహ స్తబ్ధురాలై వింటోంది.

"అటువంటి పరిస్థితుల్లో నేను తటస్థపడ్డాను. ఆమె వివాహిత అని తెలియక పొరపాటున నా ప్రేమని బయటపెట్టాను. ఆమె తన సంసారాన్ని ఎంత ప్రేమిస్తుందంటే ఆమెలోని రెండో ఆమె నన్ను అమితంగా ద్వేషించసాగింది. మరోవైపు మొదటి ఆమె ఆ ప్రేమని కాదనలేకపోయింది. అందుకే ఆ అర్ధరాత్రి నాకు ఫోన్ చేసింది. వెంటనే రెండో ఆమె ఆకాశరామన్నగా మారి మా ఇద్దరికీ ఉత్తరాలు వ్రాసింది".

"నేనిదంతా నమ్మలేకపోతున్నాను"

" ఈ స్కిజోఫ్రేనియా మీద ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ ఒక అద్భుతమైన సినిమా తీశాడు. ఒక తల్లి అంటే యువకుడికి అపరిమితమైన ఇష్టం. ఎంతిష్టమంటే తల్లి శవాన్ని కాల్చటం కూడా ఇష్టం లేక అస్థిపంజరాన్ని ఇంట్లో వుంచుకుంటాడు. తల్లి కొడుకుల ఇద్దరి సంభాషణ కొడుకే మాట్లాడుతూ వుంటాడు. చాలా చిత్రంగా తల్లి తరపున మాట్లాడేటప్పుడు కొడుకు కంఠం కూడా ముసలి స్త్రీలాగే మారిపోతుంది. ఆ కొడుకు ఒక స్త్రీతో ప్రేమలో పడతాడు. అది సహించలేక తల్లిగా వెళ్ళి ప్రియురాల్ని చంపేస్తాడు".

వింటూన్న మధూహ అప్రయత్నంగా వణికింది. అది గమనించి డాక్టర్ ప్రహసిత్ అన్నాడు "ఇందులో ఆశ్చర్యపడవలసింది ఏమీలేదు. ఈ పారానాయిడ్ సైకాలజీ ప్రతీమనిషిలోనూ కొద్దిగా వుంటుంది. తను చెడిపోతూ తనకి లేని విలువలు అవతలివారికి లేవని ఎత్తి చూపటం కూడా పారానాయిడ్ మనస్తత్వంలోకే వస్తుంది. దాన్నే ద్వంద్వ ప్రవృత్తి అంటారు".

“ఇప్పుడేం చేయాలి?”

“ ఈ విషయానికి సంబంధించినంతవరకూ చేయటానికి ఏమీ లేదు. ఈ ఉత్తరాన్ని తీసుకెళ్ళి ఆమెకి చూపించి నువ్వే దీన్ని వ్రాశావన్నా ఆమె నమ్మదు. స్కిజో ఫ్రెనియా లక్షణమే అది”.

“కానీ ఈ ఉత్తరం పట్ల ఆమె అమితంగా భయపడుతోంది. ఏదో ఒక విధంగా ఆ భయాన్ని పోగొట్టాలి”.

“ నువ్వు తాత్కాలికమైన ఉపశమనాన్నే ఆలోచిస్తున్నావు. అసలు రుగ్మతని పోగొట్టకుండా ఈ చికిత్సలేమీ ఉపయోగపడవు”.

“ఏమిటి అసలు రుగ్మత”

“నిరాసక్తత.  వైవాహిక జీవితంలో అసంతృప్తివున్న వారందరూ ఏదో ఒక విధంగా మానసిక రుగ్మతకి లోనవుతూనే వుంటారు. రకరకాల దారులను చూసుకుని వ్యాపకాలు కల్పించుకుని ఆ రుగ్మతనుంచి బయటపడటానికి ప్రయత్నిస్తారు”.

“ మీరు స్త్రీ వాదం గురించి మాట్లాడుతున్నారా?”

“అంతంత పెద్ద పెద్ద పదాలు నాకు తెలియవు. ఏ మనిషికైనా వ్యక్తిత్వం ద్వారా సంతృప్తి లభిస్తుందనీ, ఆ వ్యక్తిత్వం రావాలంటే కృషి చేయాలని, అలాంటి కృషి చేయటానికి పట్టుదల కావాలనీ మాత్రమే తెలుసు. అలాంటి పట్టుదల లేనివాళ్ళే కలల్లో తేలిపోవటమో నిరాశలో కృంగిపోవటమో చేస్తారని తెలుసు. దీనికి మీరు ఏ వాదం అని పేరు పెట్టుకున్నా సరే”.

కారు మధూహ ఇంటి దగ్గిర సందులో ఆగింది.

“ రండి. కాఫీ తాగి వెళ్తురుగాని”

“ఇప్పుడా?”

"రండి, అమ్మకూడా సంతోషిస్తుంది ...... "

మధూహ అత్తామామలు మరణించినప్పుడు ప్రహసిత్ అన్ని పనులూ తనపై వేసుకుని చేశాడు. అప్పటినుంచి అతడు దగ్గిరయ్యాడు.

ప్రహసిత్‌ని ముందుగదిలో కూర్చోబెట్టి ఆమె లోపలికి వెళ్ళి కాఫీ కలపమని తల్లికి చెప్పింది.

ప్రహసిత్ టేబిల్ మీద పేపర్ చేతిలోకి తీసుకుని చదవటం ప్రారంభించాడు.

లోపల మధూహ తల్లి కూతురికి రెండు ప్లేట్లలో స్వీట్లు పెట్టి అందించింది.

"ఇవెక్కడివమ్మా" ఆశ్చర్యంగా అడిగింది మధూహ. అంత ఖరీదైన షాపుల్లో స్వీట్లు కొనేటంత తాహతు తమకి లేదని ఆమెకి తెలుసు.

"లక్ష్మి తీసుకొచ్చిందమ్మా?" తల్లి చెప్పింది.

"ఎందుకు?"

బయట పేపరు చదువుతూన్న ప్రహసిత్ వాచీ చూసుకున్నాడు. క్లినిక్ మధ్యలో వదిలి వచ్చాడు. పేషెంట్లు ఎదురుచూస్తుంటారు. తొందరగా వెళ్ళాలి అని తను అనుకుంటూ వుండగా మధూహ స్వీట్స్‌తో వచ్చింది.

ఆమె మొహంలో సంతోషాన్ని చూసి " ఏంటి విశేషం" అని అడిగాడు.

" కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చారు" అంది మధూహ.

" ఏమిటట?"అడిగాడు.

" లక్ష్మి ప్రెగ్నెంట్ "అంది మధూహ.

లక్ష్మి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

మధూహ ఓదార్చే ప్రయత్నం ఏమీ చేయలేదు. దుఃఖం వల్ల బాధ తగ్గితే దుఃఖించటమే మంచిది.

అందుకే ఆమె ఏడుస్తూంటే చూస్తూ వుండిపోయింది.

కొంచెంసేపటికి లక్ష్మి తేరుకుంది. "ఇలా అవుతుందని నేను అనుకోలేదు".

"పోనీలే ఏం చేస్తాం? అంతా అలా వ్రాసిపెట్టి వుంది" అన్నదే కానీ మధూహకి లక్ష్మి ఎంత బాధపడుతూందో తెలుసు. ఎన్నో సంవత్సరాలుగా తల్లి కావటం లేదనే అసంతృప్తిని మనసులోనే దాచుకుని పూర్తిగా ఆశలు వదిలేసుకున్న తరుణంలో ఒక మంచి వార్త తెలిసి అది నెరవేరబోతున్న సమయంలో అబార్షన్ అవటం.

మధూహ ఓదారుస్తున్నట్టు "కనీసం నువ్వు తల్లి కాగలవు అని నిర్థారణ అయింది కదా, అది చాలు. మరొకసారి ప్రయత్నం చెయ్యవచ్చు" అంది.

వారం రోజుల క్రితమే స్కానింగ్ రిపోర్ట్ వచ్చింది. డాక్టర్ విశాల్ ఎంతో అభినందించాడు కూడానూ.

" విశాల్ క్లినిక్ మీద నాకు కొన్ని అపోహలుండేవి. నీ విషయంలో అవన్నీ జరగకపోతే ఎంతో సంతోషించాను. పాపం ఆ డాక్టర్ మాత్రం ఏం చెయ్యగలడు" అంటూ మరి కొంచెం సేపు మాట్లాడింది.

ప్రహసిత్‌కి వచ్చిన ఉత్తరం గురించి స్కిజోఫ్రెనియా గురించి ఆ పరిస్థితుల్లో చెప్పటం వ్యర్థమనిపించింది.

అదీగాక ఇప్పుడున్న పరిస్థితుల్లో లక్ష్మి ఇక తనకి తాను ఉత్తరాలు వ్రాసుకోక పోవచ్చు.

కొంచెం ఓదార్చి మధూహ వెళ్లిపోయింది.

సాయంత్రం విష్ణు వచ్చాడు.

ఈ విషయం తెలిసినప్పుడు అతను బాధపడలేదు. ఆ మాటకొస్తే లక్ష్మి గర్భవతి అయిందన్నప్పుడు కూడా అతడు అంతగా సంతోషించినట్టు కనపడలేదు.

ఫోన్‌లో ఎవరితోనో "ఏముంది? నేను మగవాడినని ప్రపంచానికి ఋజువైంది. అంతేకదా" అని అంటూండగా విన్నది. ఫోన్ పెట్టేశాక "కొడుకో కూతురో పుట్టబోతుంటే మీకు సంతోషంగా లేదా? అసలు మీకు ప్రేమలూ, ఆప్యాయతలూ లేవా?" అని అడిగింది.

అసలామె అంత మాట్లాడదు కానీ ఇంత సంతోషకరమైన వార్త విని కూడా అతడింత నిర్లిప్తంగా వుండటంతో ఆపుకోలేక పోయింది.

అతడు అదే నిర్లిప్తమైన స్వరంతో "ప్రపంచంలో ప్రతీవాళ్ళూ పిల్లల్ని కంటారు. దానికేమీ ప్రత్యేకమైన అర్హతలవసరం లేదే" అన్నాడు.

"అది లేదనేగా ఇంతకాలం బాధపడ్డాం" అంది కసిగా.

అతడు స్వరంలో మార్పేమీ లేకుండా "నువ్వు బాధపడ్డావేమో, మరి నేనెప్పుడూ  బాధ పడలేదు" అన్నాడు.

ఆ మాట మాత్రం నిజం. అతడు లేనిదాని గురించెప్పుడూ  బాధ పడినట్లు కనిపించడు.

అదే ఆమె అనుకుంది 'అవును, ఆనందాన్ని ఎలా వెతుక్కోవాలో మీకు బాగా తెలుసు'. ఆ మాట పైకి అనలేదు. అంటే అతడేం చెబుతాడో ఆమెకి తెలుసు. అందులో తప్పేముంది? అంటాడు, అందుకని అదేమీ అనకుండా "ఇంకెవరయినా అయితే ఈ వార్త విని ఎంతో సంతోషించి వుండేవారు" అంది.

“పుట్టిన వాళ్ళు ప్రయోజకులయితే నేనూ సంతోషిస్తాను. వాళ్ళు ప్రేమిస్తే నేనూ ప్రేమిస్తాను. అంతేకానీ కేవలం నాకు పుట్టిన అర్హత కారణంగా ప్రేమించను” అన్నాడు.

ఆమెకి మరింత కోపం వచ్చి ‘అవును. భార్యను ప్రేమించలేరు మీరు’ అనుకుంది మనసులో.

కానీ ఇప్పుడు....

గర్భం పోయిందని తెలిసినప్పుడు కూడా అతడు అదే స్వరంతో “పోనీలే, దానికెందుకు విచారించటం” అని మామూలుగా అనెయ్యటం ఆమెకి విచారం కన్నా ఆశ్చర్యాన్ని ఎక్కువ కలిగించింది.

అసలిలాంటి మనుష్యులుంటారా? అన్న అనుమానం కూడా వచ్చింది.